ప్రజాశక్తి

బుధవారం 29 జనవరి 2025 5 శ్రీ సత్యసాయి



నామినేటెడ్ ఆశలు..!

జూన్‌లోపు భర్తీ చేస్తామంటూ ముఖ్యమంత్రి ప్రకటన

పదవులపై నాయకుల ఆశలు

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

ముఖ్యమంత్రి ప్రకటనతో ఆశావహుల్లో ఉత్సహం నెలకొంది. సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ ఉమ్మడి జిల్లాలో ఎప్పుడూలేని విధంగా విజయం సాధించింది. దీనికితోడు ఈసారి కూటమి పార్టీలు ఉన్నాయి. టిడిపితోపాటు, బిజెపి, జనసేన పార్టీలూ ఉన్నాయి. పదవుల్లో వీరికి పంపకాలు చేయాల్సి ఉంది. ఇప్పటికే అహుడా ఛైర్మన్ పదవిని జనసేనకు కేటాయించారు. ఆ పార్టీల నుంచి కూడా ఆశావహులు ఉండటంతో టిడిపి నేతల్లో నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న వారిలో సందిగ్ధత నెలకొంది. తమకు పదవులు వస్తాయా లేదా అన్న గుబులు నెలకొంది. మొదటి మూడు పంపకాల్లో జిల్లాలో ముఖ్య నేతలకు ఆశించిన పెద్ద పదవులేవి రాలేదు. ఇప్పుడు మార్కెట్‌యార్డు, దేవాలయాల ఆలయ కమిటీల్లో నైనా అవకాశాలు దక్కుతాయా లేదా అన్న సందేహాలు ఉన్నాయి. వీటినైనా త్వరగా తేలిస్తే బాగుంటుందన్న అభిప్రాయం ఆ పార్టీ నేతల నుంచి వ్యక్తమవుతోంది.

సహకార సంఘాలపైనా ఆశలు

నామినేటెడ్ పదవులే కాకుండా సహకార సంఘాలపైనా ఆశలు పెట్టుకున్న వారున్నారు. ఈ సంఘాలకు ఎన్నికలు జరగక చాలాకాలమైంది. గత ప్రభుత్వం పర్సన్ ఇన్‌ఛార్జీలను పెట్టి వారితోనే సహకార సంఘాలను కొనసాగించింది. టిడిపి ప్రభుత్వం మాత్రం సహకార సంఘాల ఎన్నికలకూ కసరత్తును చేపట్టింది. సభ్యత్వాలను చేపడుతున్నారు. ఎన్నికలు నిర్వహించే అవకాశాలే అధికంగానున్నట్లు తెలుస్తోంది. ఎన్నికలు జరిగితే పార్టీ తరుపున పోటీ చేసేందుకు కొంత మంది సిద్ధమవుతున్నారు. ఎందుకంటే ప్రతిపక్ష వైసిపి ఎన్నికల బరిపై పెద్దగా ఆసక్తి చూపే పరిస్థితులు కనిపించడం లేదు. ఇటీవల జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లోనూ ఇది స్పష్టంగా కనిపించింది. చాలా వరకు ఏకగ్రీవం చేసుకున్నారు. అదే ఫార్ములా సహకార సంఘాల ఎన్నికలు జరిగినా అమలు జరుగుతుందని అధికార టిడిపి నేతలు భావిస్తున్నారు. ఏది ఏమైనా అన్ని పదవులను త్వరితగతిన భర్తీ చేయాలని టిడిపి నేతలు కోరుతున్నారు.

పోలీసులు ఆయుధ పరిజ్ఞానం పెంచుకోవాలి : ఎస్పీ

ఫైరింగ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ వి.రత్న

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పోలీసు అధికారులు, ఏఆర్ సిబ్బంది తమ విధుల్లో వినియోగిస్తున్న ఆయుధాల పనితీరుపై పరిజ్ఞానం పెంపొందించుకోవాలని ఎస్పీ వి.రత్న సూచించారు. ఈ నెల 17వ తేదీ ప్రారంభమైన ఈ మొబలైజేషన్ కార్యక్రమం ఫిబ్రవరి 3వ తేదీ వరకూ కొనసాగుతుంది. అందులో భాగంగా బుక్కపట్నం మండలంలోని చంద్రాయునిపల్లి సమీపంలోని పోలీస్ ఫైరింగ్ మైదానంలో జరుగుతున్న ఏఆర్ పోలీసుల ఫైరింగ్ ప్రాక్టీస్‌ను ఎస్పీ పర్యవేక్షించారు. ఆమె మాట్లాడుతూ సిబ్బందికి వృత్తి నైపుణ్యం అంశాలతో పాటు ఆయుధాల వినియోగంలో మెలకువలు నేర్పిస్తారన్నారు. అనుకోని సంఘటనలు జరిగినప్పుడు అల్లరి మూకలను చెదరగొట్టే సమయంలో ఉపయోగించే గ్యాస్ గన్, స్టెన్ గన్స్‌ను ఎలా వినియోగించాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఆర్ డిఎస్‌పి శ్రీనివాసులు, ఆర్ఐలు మహేష్, వలి, ఎస్‌బి ఎస్ఐ ప్రదీప్‌కుమార్, ఆర్ఎస్ఐలు ప్రదీప్‌సింగ్, వీరన్న, ప్రసాద్ పాల్గొన్నారు.

.బండి దారికి అడ్డుగా వేసిన కంచె

శ్రీషిర్డిసాయి గ్లోబల్ ట్రస్టు ఫాంహౌస్ గేటు ముందు బైఠాయించిన రైతులు

పొలాల దారికి కంచె..!

భూములకు వెళ్లే బండి దారిని అక్రమించి రైతులు పొలాలకు వెళ్లేందుకు వీలు లేకుండా కంచె వేశారు. పశువులకు తాగునీటి కోసం ప్రభుత్వ భూమిలో ఉన్న కుంట, గుట్టపోరంబోకు భూమి, కొందరు రైతుల పొలాలను సైతం దురాక్రమణకు పాల్పడ్డారు. అధికారుల వద్ద రైతులు గోడు వెల్లబోసుకున్నా ఫలితం శూన్యం. మంత్రి ఆదేశాలను సైతం సదురు ఆక్రమతదారులు బేఖతార్ చేసిన పరిస్థితులు ఉన్నాయి. దారి విషయంపై రైతులు మంగళవారం నాడు ఆందోళనకు దిగడంతో ఈ సమస్య వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించి బాధిత రైతులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి...

- భూమిని ఆక్రమించి కంచెవేసిన శ్రీషిర్డిసాయిగ్లోబల్ ట్రస్టు
- సాగుకు వీలుకాక రైతుల ఇబ్బందులు
- మంత్రి ఆదేశాలూ బేఖతారు
- కంచె తొలగించి దారి ఇవ్వాలని రైతుల నిరసన

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ మండలం వాసుదేవపురం(రాంపురం) పొలంలో వెంకటరెడ్డిపల్లికి చెందిన రైతులకు భూములున్నాయి. పదిహేనేళ్ల క్రితం శ్రీసాయి కాళేశ్వర్ శ్రీషిర్డిసాయి గ్లోబల్ ట్రస్టు పేరుతో సుమారు 180ఎకరాలను రైతులతో కొనుగోలు చేశారు. అప్పట్లో ప్రయివేటు సర్వేయర్లతో సర్వేచేయించి పొలం చుట్టు కంచె వేయించారు. ఈ భూమి చుట్టుపక్కల రైతుల వెళ్లే దారిని సైతం అక్రమించి కంచెవేశారు. అప్పట్లో భూములకు విలువ లేక, నీటి వసతి లేక రైతులు సాగు చేయకుండా బీడుగా వదలేశారు. కియా కార్ల పరిశ్రమ రాకతో ఈ ప్రాంతంలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. బీడు భూములుగా ఉన్న పొలాను రైతులు సాగు చేసేందుకు సిద్ధం అయ్యారు. అయితే పొలాల్లోకి వెళ్లేందుకు దారి లేక ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వభూమి, కుంట కబ్జా

శ్రీషిర్డీసాయి గ్లోబల్ ట్రస్టు కొనుగోలు చేసిన భూములతో పాటు పక్కనే ఉన్న కొండ పొరంబోకు భూమి, కుంటను కబ్జా చేశారని రైతులు ఆరోపిస్తున్నారు. 180 ఎకరాల భూమి కొనుగోలు చేసి దాదాపు 200 ఎకరాలకు పైగా భూమికి కంచె వేసి దురాక్రమణ చేసినట్లు విమర్శలున్నాయి. తమ పొలాలకు వెళ్లాలంటే దారి లేదని శ్రీషిర్డిసాయి గ్లోబల్ ట్రస్టు యజమాన్యం దారి అక్రమించి కంచె వేశారని తమకు దారిచూపాలని రెవిన్యూ అధికారులకు రైతులు పలుమార్లు వినతులు అందించారు. అయినా అధికారులు స్పందించలేదు. ఇన్నాళ్లు ఏమి చేస్తున్నారంటూ అధికారులు రైతులను ఎదురు ప్రశ్నించడం తప్పా సమస్య పరిష్కారంపై దృష్టి సారించలేదు.

కబ్జాచేసినారని రైతులు చెబుతున్న భూమి

మంత్రి ఆదేశాలు బేఖతార్

రాష్ట్ర బిసి సంక్షేమ,చేనేత,జౌళిశాఖ మంత్రి సవిత మూడు నెలల క్రితం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో బాధితరైతులు పొలాలకు దారి సమస్యపై వినతి పత్రం ఇచ్చారు. స్పందించిన మంత్రి తక్షణం రైతులకు దారి చూపాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అధికారులు, రైతులు, శ్రీషిర్డిసాయి గ్లోబల్ ట్రస్టు యజమాన్యం కంచె వేసి భూమిని పరిశీలించారు. బండి దారి ఉందని రెవెన్యూ అధికారులు గుర్తించారు. రైతులకు దారి చూపుతామని చెప్పి మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ దారికి అడ్డుగా ఉన్న కంచెను తొలగించలేదు.

ఆక్రమించి కంచె వేశారు...

శ్రీషిర్డిసాయి గ్లోబల్ ట్రస్టు యజమాన్యం భూముల చుట్టు వేసిన కంచెలో పలువురి రైతుల భూములున్నాయి. అందులో చంద్రప్పకు చెందిన సర్వేనెంబర్ 21లో 1.30 ఎకరాలు, దబ్బల అంజినప్పకు చెందిన సర్వేనెంబర్ 55-బిలో 2.70 ఎకరాలల్లో శ్రీషిర్డిసాయి గ్లోబల్ ట్రస్టు యజమాన్యం 2.50 ఎకరాలు కొనుగోలు చేసింది. మిగిలిన 0.20 ఎకరాల భూమి, పి.అదెమ్మకు చెందిన సర్వేనెంబర్ 14,15లో 2 ఎకరాలు, అలివేలమ్మకు చెందిన సర్వేనెంబర్ 31-1ఎ, 21-2లో 1-92 ఎకరాలు, సావిత్రమ్మకు చెందిన సర్వేనెంబర్ 21-2, 31-10లో 1.30 ఎకరాలు, పి.అంజినప్పకు చెందిన సర్వేనెంబర్ 13-2లో 3.66 ఎకరాలు, సర్వేనెంబర్ 20-1లో 2.54 ఎకరాల పొలం ముగ్గురు అన్నదమ్ములకు హక్కుఉంది. అందులో ఒక భాగం మాత్రమే శ్రీషిర్డి సాయి గ్లోబల్ ట్రస్టు కొనుగోలు చేసింది. మొత్తం భూమి అక్రమించి కంచె వేశారని సంబంధింత రైతులు ఆరోపిస్తున్నారు.

దారి ఇవ్వాలని రైతుల నిరసన..

తమ భూములకు దారి చూపాలంటూ శ్రీషిర్డిసాయి గ్లోబల్ ట్రస్టు ఫాంహౌస్ గేటు ముందు రైతులు మంగళవారం నాడు నిరసన చేపట్టారు. తమకు న్యాయం చేయాలని దారికి అడ్డుగా వేసిన కంచె తొలగించాలని వెంకటేష్ ప్రసాద్, శ్రీనివాసులు, బాస్కర్, వెంకటేశులు, అలివేలమ్మ, సావిత్రమ్మ తదితరులు డిమాండ్ చేశారు. కబ్జా చేసి కంచెవేసిన భూములను తిరిగి ఇవ్వాలని కోరారు.

కంచె తొలగిస్తాం

వారంలోపు దారికి అడ్డుగా ఉన్న కంచె తొలగిస్తాం. శ్రీషిర్డి సాయి గ్లోబల్ ట్రస్టు యజమాన్యం, రైతుల ఆధ్వర్యంలో కంచె తొలగించి పొలాలకు దారి చూపుతాం. ప్రభుత్వభూమి, కుంట కబ్జా చేశారని రైతులు చెబుతున్నారని, సర్వేచేసి నిజనిజాలు తెలుస్తాం.

శ్రీధర్, తహశీల్దార్.

విజయం సాధించిన జట్టు

బాలికల అండర్-13 విభాగంలో లేపాక్షి జట్టు విజయం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఎంజీఎం ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం బాలికల అండర్ 13 విభాగంలో లేపాక్షి జట్టు విజయం సాధించింది. హిందూపురం టౌన్ ఫుట్ బాల్ క్లబ్ ఆధ్వర్యంలో అస్మిత ఫుట్ బాల్ లీగ్ అండర్ 13 బాలికల విభాగంలో మ్యాచ్ నిర్వహించారు. హిందూపురం, లేపాక్షి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో లేపాక్షి జట్టు 2-1 గోల్స్ తేడాతో విజయం సాధించింది. మ్యాచ్ రిఫరీలుగా మొహమ్మద్ సలీం, శివప్రసాద్, కష్ణవేణి, జగదీష్ లు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారుడు ఆజాద్, ఫిజికల్ డైరెక్టర్లు లోకనాథ్, రామాంజనేయులు, భాస్కర్, కోచులు విజయవాణి, సుశీల, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

భవనాన్ని కేటాయించాలని వినతి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో ప్రసిద్ధిగాంచిన పేట వెంకటరమణ స్వామి దేవాలయం తేరు నిలబెట్టేందుకు అవసరమైన భవన సముదాయాన్ని కేటాయించాలని ఆలయ కమిటీ ప్రతినిధులు, టిడిపి నాయకులు తహశీల్దార్ వెంకటేశును కోరారు. మంగళవారం ఈ విషయంపై తహశీల్దార్ కార్యాలయంలో టిడిపి నాయకులు తహశీల్దార్ వెంకటేశుతో చర్చించారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు డిఈ రమేష్ కుమార్, కౌన్సిలర్ రాఘవేంద్ర, టిడిపి నాయకులు దుర్గా నవీన్, నెట్టప్ప పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే వీవోఎల తొలగింపు : సిఐటియు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

కేవలం రాజకీయ కక్షతో కూటమి ప్రభుత్వం వెలుగు వీవోఏను తొలగించిందని, వారికి న్యాయం జరిగేంత వరకూ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ హెచ్చరించారు. పట్టణంలోని కలెక్టరేట్ ముందు వివోఏలు చేపట్టిన సామూహిక నిరాహార దీక్షను మంగళవారం కొనసాగించారు. వెంకటేష్ మాట్లాడుతూ వెలుగులో ఏళ్లుగా పనిచేస్తున్న వివోఏలను కూటమి ప్రభుత్వం తొలగించడం దుర్మార్గమన్నారు. వారికి కొనసాగించాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వీరికి బకాయిలు ఇవ్వకుండా పలుచోట్ల టిడిపి సభ్యత్వానికి వాడుకున్నట్లు తెలిసిందన్నారు. జిల్లాలో దాదాపు 800 మంది వివోఏలు నేడు రోడ్డున పడ్డారన్నారు. సమస్య పరిష్కారం కాకుంటే మార్చిలో జరిగే అసెంబ్లీ సమావేశాల సమయంలో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ దీక్షలకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు మద్దతు తెలిపారు. దీక్షలో శకుంతల, హనుమంత రాయుడు, అనిత, మమత, చంద్రకళ, కవిత తదితరులు పాల్గొన్నారు.



రిలే దీక్షలో మాట్లాడుతున్న ఈఎస్ వెంకటేష్

చంద్రబాబు మాటలన్నీ అసత్యాలే..

వైసిపి సమన్వయకర్త దీపికా వేణు రెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాటలు, హామీలన్ని అబద్దాలేనని వైసిపి సమన్వయకర్త దీపికా వేణురెడ్డి ఆరోపించారు. మంగళవారం వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలపై పచ్చి అబద్ధాలు చెబుతూ కోట్లాది మందిని చంద్రబాబు మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల హామీలపై బాబు యూటర్న్ తీసుకోవడం అత్యంత దుర్మార్గం అన్నారు. చంద్రబాబు నాయుడు రాజకీయమంతా ప్రజల నుంచి లాక్కోవడమే గానీ ఇచ్చింది లేదన్నారు. ఎన్నికల ముందు హామీలిచ్చి ఇప్పుడు ఆచరణ సాధ్యం కాదని చెప్పడం సిగ్గుచేటన్నారు. సంక్షేమం, అభివద్ధిని రెండు కళ్ళుగా చేసుకుని వైఎస్.జగన్ మోహన్ రెడ్డి పాలన చేశారన్నారు. కరోనా సమయంలో కూడా రాష్ట్రంలో ఆదర్శ పాలనను అందించారన్నారు. విద్యుత్ భారాలతో ప్రజలపై మోయలేని భారం వేశారన్నారు. టిడిపి పాలనలో మద్యం ఏరులై పారుతోందన్నారు. చంద్రబాబు ఏడు నెలల పాలన అంతా వంచన, మోసం, దోపిడీతోనే సాగిందన్నారు. హామీలు అమలు చేయలేని చంద్రబాబు ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.



దీపికా వేణురెడ్డి

ఉపాధి, దళితుల సమస్యలు పరిష్కరించండి

వ్యకాసం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా

కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మికులు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

దళితులు, ఉపాధి హామీ సమస్యలను పరిష్కరించాలని వ్యకాసం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ దళితులు, ఉపాధి కూలీల సమస్యలపై ఈనెల 8 నుంచి 27వ తేదీ వరకు వ్యకాసం ఆధ్వర్యంలో జిల్లాలోని పలు మండలాల్లో సర్వే నిర్వహించామన్నారు. గోరంట్ల, ముదిగుబ్బ, పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం, చిలమత్తూరు, సోమందేపల్లి, రొద్దం మండలాల్లో దళితవాడల్లో సర్వే నిర్వహించగా పలు సమస్యలు తమ దృష్టికి వచ్చాయన్నారు. దళిత కాలనీవాసులకు శ్మశాన వాటికలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దళిత కాలనీలకు రహదారి సమస్యలున్నాయన్నారు. పక్కా ఇళ్ల లేక పూరిపాకల్లో నివాసం ఉంటున్నారని తెలిపారు. ఉపాధి పనులకు సంబంధించి కూలీలకు ప్రతివారం పే స్లిప్పులు ఇవ్వకపోవడం తక్కువ కూలి వస్తోందన్నారు. రోజు కూలి రూ.400 ఇచ్చి, ఏడాదికి 150 రోజుల పని దినాలు కల్పించాలన్నారు. పుట్టపర్తి మండలం కప్పలబండ గ్రామ పొలంలో మాజీ మావోయిస్టులకు ఇచ్చిన స్థలాలను కొందరు అన్యక్రాంతం చేయడానికి యత్నిస్తున్నారని దీనిని అడ్డుకోవాల్సి ఉందన్నారు. అనంతరం సమస్యలను పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఈఎస్.వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, కోశాధికారి వెంకటేష్, ఉపాధ్యక్షులు ఆంజనేయులు, కమిటీ సభ్యులు స్వర్ణలత, రమాదేవి, నారాయణ, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, పెద్దన్న, ఆదినారాయణ, అంజనప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

మాతాశిశుమరణాలను నియంత్రిద్దాం

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో మాతా శిశు మరణాలను పూర్తి స్థాయిలో నియంత్రించేలా వైద్య సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో మాత, శిశుమరణాలపై వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య అధికారిణి డా॥ ఫైరోజ్ బేగం సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణి అయినప్పటి నుంచి కాన్పు అయ్యే వరకు ప్రతి ఆశా వర్కర్, ఆరోగ్య కార్యకర్త, సూపర్‌వైజర్ దగ్గర ఆమె వివరాలు ఉండాలన్నారు. డిఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రతి ఆశాడే సమావేశం, ప్రతి నెలా 9న జరిగే ప్రధానమంత్రి సురక్షిత మాతత్వ అభియాన్‌లో గర్భిణులకు గ్రూపు సమావేశం ఏర్పాటు చేసి ఆరోగ్య జాగ్రత్తలు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ తిప్పేంద్ర నాయక్, డిఐఓ డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ మంజువాణి, డిప్యూటీ డిఎంహెచ్ఓ సేల్వియా సల్మాన్‌తో పాటు వైద్యులు పాల్గొన్నారు.

పార్టీ, ప్రభుత్వ ప్రతిష్టను పెంచుదాం : కందికుంట

ప్రజాశక్తి-కదిరి అర్బన్

స్వార్థ రాజకీయాలకు అలవాటు పడి కులం, మతం పేరుతో మభ్యపెట్టే రాజకీయాలు చేస్తే ప్రజలే బంగాళాఖాతంలో కలిపేస్తారని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. పట్టణంలోని పివిఆర్ కళ్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన పట్టణ టిడిపి ఆత్మీయ సమావేశానికి ఎమ్మె ల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యకర్తల అభిప్రాయాలు తెలుసుకునేందుకే ఈ ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. అధికారం, అహంకారం లాంటివి పక్కన పెట్టి పార్టీ, ప్రభుత్వ ప్రతిష్టను పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రతి కార్యకర్తకు కూటమి ప్రభుత్వం అండ గా ఉంటుందన్నారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్త పార్టీ దృష్టిలో ఉంటారన్నారు. అక్రమాలు చేసేవారు, ప్రజల సొమ్మును దోచుకునే వారు ఎంతటి వారైనా ఉపేక్షించమని హెచ్చరిం చారు. సిఎం చంద్రబాబు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రజలకు వివరించేందుకు కృషి చేస్తుంటే వైసిపి నాయకులు ప్రజల్లో లేనిపోని అపోహలు కల్పించడం, వక్రీకరించడం తగదని విమర్శించారు. సమావేశంలో టిడిపి నాయ కులు కృష్ణమోహన్‌నాయుడు, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజశేఖర్‌బాబు, వాల్మీకి పాఠశాల అధినేత అనిల్‌కుమార్‌రెడ్డి, పర్వీన్‌బాను, పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, బండారు మనోహర్ నాయుడు, బాహుద్దీన్, కౌన్సిలర్లు ముస్తఫా, సావిత్రమ్మ, మహబూబ్, నాగప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కందికుంట వెంకటప్రసాద్

చిన్నారికి ఎమ్మెల్యే కందికుంట పరామర్శ

కదిరి టౌన్ : పట్టణంలో కుక్కల దాడిలో గాయపడిన చిన్నారిని మంగళవారం ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పరామర్శించారు. స్థానిక కదిరి-రాయచోటిలో రోడ్డులో ఉన్న మక్కా మసీద్ వెనుక వీధిలో కుక్కలు చిన్నారి బుష్రాఫాతిమాపై దాడి చేసి గాయపరిచాయి. ఈ విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే వారి ఇంటికి వెళ్లి చిన్నారిని పరామర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కుక్కల దాడిలో చిన్నారి గాయపడం దురదృష్టకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కోకుండా మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ ఉన్నారు.

మెడికల్ రెప్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-హిందూపురం

ఆంధ్రప్రదేశ్ మెడికల్, సేల్స్ రిప్రజెంటేటివ్ హిందూపురం శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులుగా రామ్మోహన్, హరికష్ణ, కార్యదర్శిగా ఎం.రామ్మూర్తి, సంయుక్త కార్యదర్శులుగా వసిమ్, లోకేష్, కోశాధికారిగా మునీర్, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాస్ మూర్తి, మహబూబ్ బాషా, ఇర్ఫాన్‌లను ఎన్నుకున్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం అందించాలని ఆర్‌డిఒ మహేష్ ఆదేశించారు. ఆయన మంగళవారం మండలంలోని నడిమిగడ్డపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలను సందర్శించి హాజరు పట్టికను పరిశీలించారు. విద్యార్థుల హాజరు, బోధనపై ఇన్‌ఛార్జి హెచ్ఎం కళావతిని అడిగి తెలుసుకున్నారు. చదువుపై మరింత శ్రద్ధ కనబరచాలని విద్యార్థులకు సూచించారు.

కళాశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలన

ఆర్ఐఒ సురేష్‌బాబు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని ఆదేశించారు. అలాగే హాజరు పట్టికతో పాటు వివిధ రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట కళాశాల ఛైర్మన్ బండి వేణుగోపాల్, ప్రిన్సిపల్ లక్ష్మీకాంత్ రెడ్డి ఉన్నారు.

పెనుకొండ అభివృద్ధికి సహకరించండి : మంత్రి

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ అభివృద్ధికి సహకరించాలని కోరుతూ బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత మంత్రులు బాలవీరాంజనేయస్వామి, ఫరూక్‌లకు వినతి పత్రాలు ఇచ్చారు. ఆమె మంగళవారం రాష్ట్ర సచివాల యంలో ఆయా మంత్రులను కలిసి పెనుకొండలో చేపట్టబోయే పలు అభివృద్ధి పనులపై చర్చించారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను వారికి వివరించారు. మండలాల్లో అంబేద్కర్ భవనాల నిర్మాణ విషయమై మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి దృష్టికి తీసుకెళ్లారు. సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతుల కల్పన, మరమ్మతులు చేపట్టాని తెలిపారు. అనంతరం రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌తో భేటీ అయ్యారు. పెనుకొండలో షాదీఖానా అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని, సంక్షేమ పథకాల అమలులో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఆమెతో పాటు రాష్ట్ర గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి గురుమూర్తి ఉన్నారు.

మంత్రి బాల వీరాంజనేయస్వామికి వినతిఎ ఇస్తున్న సవిత

ఎన్నికల హామీలను అమలు చేయాలి

ప్రజాశక్తి-మడకశిర రూరల్

కూటమి ప్రభుత్వం తక్షణమే ఎన్నికల హామీలను అమలు చేయాలని నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఈరలక్కప్ప డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే ఉద్దేశంతో ఎన్నికల సమయంలో టిడిపి అధినేత చంద్రబాబు నోటి కొచ్చిన హామీలు ఇచ్చి అధికారం చేపట్టాక అమలు చేయడం లేదని తీవ్రంగా మండిపడ్డారు. దీనికి తోగు వైసిపి ప్రభుత్వం అమలు చేసిన అనేక పథకాలను ఒక్కొక్కటిగా రద్దు చేసే దిశగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానంగా విద్యార్థులు, మహిళలు, యువత, బడుగు, బలహీన వర్గాల వారికి పూర్తిగా అన్యాయం చేస్తుందన్నారు. జగన్ ప్రభుత్వం చేసిన పోర్ట్స్, తదితర అభివృద్ధి పనులను తామే చేసినట్లుగా ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కంపెనీ లు తెస్తామంటూ దావోస్‌కు వెళ్లిన సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ సాధించింది ఏమీ లేదన్నారు. ఇకనైనా సిఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, లేనిచో వైసిపి ఆధ్వర్యంలో పెద్దఎత్తున ప్రజా ఉద్యమం లేవదీస్తామని హెచ్చరించారు.

ఈరలక్కప్ప

పిల్లలపై నిరంతర నిఘా అవసరం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

తల్లిదండ్రులు పిల్లల పట్ల సానుకూల దృక్పథంతో కలిగి ఉండి నిరంతరం ఇంటా, బయట నిఘా ఉంచాలని జిల్లా బాలల పరిరక్షణ అధికారి మహేష్ సూచించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, జిల్లా బాలల పరిరక్షణ సమితి, చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళ వారం పట్టణంలోని జిల్లా సమాఖ్య సమావేశ భవనంలో తల్లిదండ్రులతో 'పాజిటివ్ పేరెంటింగ్' అంశంపై కార్యశాల నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మహేష్ మాట్లాడుతూ తల్లిదం డ్రులు పని వత్తిడి వల్ల పిల్లలతో గడపడం లేదని, తద్వారా పిల్లలు ప్రేమ, ఆప్యాయత, అనురాగాలకు దూరమై ఒంటరి తనంతో ఉండాల్సి వస్తుందని ఇది మంచి పరిణామం కాదన్నారు. పిల్లల పట్ల సానుకూలంగా స్పందిస్తూ వారితో కొద్ది సమయం గడుపుతూ ఆరి ఆలనా పాలనలో జాగ్రత్తలు వహించాలన్నారు. సిఐఎఫ్ కొండప్ప మాట్లాడుతూ ఏ తల్లిదండ్రులు పిల్లల కోసం కాకుండా పిల్లల తోటి జీవిస్తారో ఆ కుటుంబంలో ఎలాంటి సమస్యలు తలెత్తవన్నారు. పిల్లలు మొబైల్‌లో ఏమి చేస్తున్నారో నిత్యం పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ డిపిఎం లలిత, ఏరియా కోఆర్డినేటర్ పద్మావతి, డిసిపియు ప్రొటెక్షన్ ఆఫీసర్ మురళి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అధికారి మహేష్

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-కొత్తచెరువు

వృత్తి పరంగా జిల్లాలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం డీఈవో కార్యాలయం ఏడి రామకృష్ణకు ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోనంకి చంద్రశేఖర్ వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ హిందూపురంలో రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రాథమిక ఉన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా మార్చాలని, ప్రస్తుతం బీఈడీ చేస్తున్న అభ్యర్థులకు టీచింగ్ ప్రాక్టీస్‌కు అనుమతి ఇవ్వాలని, అన్ని మేనేజ్మెంట్లలో వాయిదా పడిన ఇంగ్లీషు, తెలుగు పోస్టుల్లో ఉద్యోగోన్నతులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా ఆర్థిక కార్యదర్శి గోపాల్‌నాయక్, హిందూపురం అధ్యక్షులు షమీవుల్లా, ప్రధాన కార్యదర్శి రాము, జిల్లా కౌన్సిలర్ వసీం, పుట్టపర్తి ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, బుక్కపట్నం కౌన్సిల్ మెంబర్ అనిల్ పాల్గొన్నారు.

కార్పెంటర్ కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణానికి చెందిన కార్పెంటర్ ఖాజా మృతికి మంగళవారం శ్రీవిశ్వకర్మ కార్పెంటర్స్ అసోసి యేషన్ సభ్యులు నివాళలర్పించారు. ఖాజా భార్యను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. భవిష్యత్తులో కూడా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడు శివ, గౌరవాధ్యక్షులు శంకర, కౌన్సిలర్ బ్రహ్మయ్య మాట్లాడుతూ ఖాజా అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమన్నారు. భవిష్యత్తులో ఏ కార్పెంటర్‌కి కష్టమొచ్చినా అసోసియేషన్ అండగా ఉంటుందన్నారు. కార్పెంటర్లు, పెయింటర్లకు గుర్తింపు కార్డు ఉండాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో అసోషియేషన్ భవన నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. వృత్తి పరంగా ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొంటూ కార్మికుల సంక్షేమం కోసం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో బ్రహ్మచారి, లోకేష్, నారాయస్వామి, నంజుండాచారి, నాగరాజు, బాబావలి, సారుక్, సూరి పాల్గొన్నారు.

అసంక్రమిత వ్యాధుల సర్వే పరిశీలన

ప్రజాశక్తి-గాండ్లపెంట

అసంక్రమిత వ్యాధులపై పిహెచ్‌సి సిబ్బంది చేపట్టిన ఇంటింటి సర్వేను మంగళవారం జిల్లా అధికారి ప్రోగ్రాం డాక్టర్ నివేదిత స్థానిక మసీదు వీధిలో తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ సభ్యులను సర్వే చేసి వివరాలు నమోదు చేయాలని, అసంక్రమిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పిహెచ్‌సిని సందర్శించి మందుల గదిని పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ఆమె వెంట వైద్యాధికారి బాబాఫకృద్దీన్, సిబ్బంది విజయ్‌కుమార్, ఉపేందర్రెడ్డి, ఫార్మసీ సిబ్బంది ప్రసాద్ ఉన్నారు.

విదేశీ ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

నర్సింగ్ విద్యార్థులు విదేశీ ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర నైపుణ్యా భివృద్ధి సంస్థ జిల్లా అధికారి బండ్ల హరికృష్ణ సూచించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జగరాజుపల్లి జమీపంలోని విజ్ఞాన్ నర్సింగ్ కళాశాలలో బిఎస్సి నర్సింగ్ చేస్తున్న విద్యార్థినులకు మంగళవారం స్కిల్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం ద్వారా అందిస్తున్న అవకాశాలు, వాటి ఆవశ్యకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హరికష్ణ ఉచిత శిక్షణ, గల్ఫ్ దేశాల్లో అందిస్తున్న డైరెక్ట్ ప్లేసెమెంట్స్, ఉద్యోగ మేళాలో అవకాశాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మనోరంజని చైతన్య, ఎడిఎస్‌డిఈ సీడాప్ కోఆర్డినేటర్ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల అనంతరెడ్డి వర్థంతి

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండలంలోని మాల్యవంతం గ్రామం లో ఉన్న అనంత ఘాట్‌లో మంగళవారం మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల అనంతరెడ్డి వర్థంతి వేడుకల ను కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ముందుగా అనంతరెడ్డి కుమారుడైన టిడిపి రాష్ట్ర కార్యదర్శి, ఎపి అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గోనుగుంట్ల విజయ్‌కుమార్, రూపలత దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి సమాధిపై పూలమాల వేసి నివాళులర్పించారు. ధర్మవరం నియోజకవర్గం తో పాటు అనంతపురం జిల్లాకు చెందిన పలువురు టిడిపి నాయకులు తరలివచ్చి నివాళులర్పించారు. అందరికీ భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో నియోజవర్గ తెలుగు రైతు సంఘం అధ్యక్షులు చల్లా శ్రీనివాసనాయుడు, మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డ, నాయకులు గోనుగుంట్ల అమర్నాథ్‌చౌదరి, సుబ్బరాయుడు, సురేంద్రనా యుడు, నెట్టెం రమణ, జక్కంపూడి నాగభూషణ, సంఘాల సూరి, తదితరులు పాల్గొన్నారు.

'అనంత' మెగా వైద్య శిబిరం

అనంతరెడ్డి వర్థంతి సందర్భంగా గోనుగుంట్ల విజయకుమార్ ఆధ్వర్యంలో మాల్యవంతం గ్రామంలో 'అనంత' మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ప్రముఖ వైద్యులు కె.కొండయ్య, జి.ప్రదీప్‌క్రిష్ణ, ఉన్నం శశాంక్, చల్లా నీలిమ, శివప్రకాష్ రావు, వెంకటరామిరెడ్డి, ఎం.దివాకర్, చిట్టా శ్రీలక్ష్మి, సత్యం సిటీ స్కాన్ ఎండి జొన్న సత్యనారాయణ, భాస్కర్‌నాయక్, ఉదయ్ కుమార్ ప్రజలకు వివిధ జబ్బులకు వైద్య సేవలు అందించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వైద్యులను గోనుగుంట్ల విజయకుమార్ దంపతులు సన్మానించి మెమెంటోలు అందజేశారు.

అనంత ఘాట్‌లో నివాళులర్పిస్తున్న గోనుగుంట్ల కుటుంబ సభ్యులు

కేంద్ర మంత్రికి డిజైన్ల గురించి వివరిస్తున్న నాగరాజు

ఢిల్లీలో ధర్మవరం పట్టుచీరల డిజైనర్

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

కేంద్ర ప్రభుత్వం ఆహ్వానం మేరకు పట్టణానికి చెందిన పట్టుచీరల డిజైనర్ జె.నాగరాజు మంగళ వారం న్యూఢిల్లీలో జరిగిన చేనేతల అభివృద్ధి, గుర్తింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర చేనేత, జౌళి శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్‌ను డిజైనర్ నాగరాజు కలిసి ధర్మవరం పట్టు చీరల విశిష్టత, డిజైన్ల గురించి వివరించారు. అలాగే ధర్మవరం పట్టు చీరల తయారీకి ప్రస్తుతం వినియోగిస్తున్న అధునాతన సాంకేతిక పరికరాలు, యంత్రాల గురించి వివరించారు.

సర్టిఫికెట్లు తీసుకెళ్లండి : డిఇఒ

ప్రజాశక్తి-కొత్తచెరువు

ఏప్రిల్-2024లో టెక్నికల్ కోర్సుకు సంబంధించిన లోయర్, హయర్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిం చిన విద్యార్థులు డిఇఒ కార్యాలయం వచ్చి సర్టిఫికెట్లు తీసుకెళ్లాలని డిఇఒ కృష్ణప్ప మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్ కోర్సులైన డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడింగ్‌లో ఉత్తీర్ణత సాధించిన వారు హాల్ టికెట్ తీసుకొచ్చి సర్టిఫికెట్లను తీసుకెళ్లాలని కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

స్థానిక డిఇఒ కార్యాలయంలో డిఇఒ కృష్ణప్ప ఎపి ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. డిఇఒ మాట్లాడుతూ ఉద్యోగులు అంకిత భావంతో విధులు నిర్వర్తించాలన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అసోసి యేషన్లు పని చేయాల న్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు జయ రామ్, జిల్లా వృత్తి విద్య అధికారి లాజర్, ఉద్యోగులు శ్యామ్, సురేష్‌నాయక్, రవి పాల్గొన్నారు.

పింఛన్ల పరిశీలన

ప్రజాశక్తి-తాడిమర్రి

మండలంలోని దాడితోట, నాయన పల్లి, చిల్లవారిపల్లి, తురకవారిపల్లి గ్రామాల్లో మంగళవారం వైద్యులు డాక్టర్ నరసింహారెడ్డి, డాక్టర్ చైతన్య రూ. 15 వేలు పొందుతున్న పింఛనుదారుల ఇళ్లకు వెళ్లి వివరాలు నమోదు చేశారు. సర్టిఫికెట్లను పరిశీలించారు. వైద్యులు మాట్లాడుతూ సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకటరంగారావు, పిహెచ్‌సి డాక్టర్ హరిత, అధికారులు పాల్గొన్నారు.

నంబులపూలకుంట : సామాజిక భద్రత పింఛన్ల పరిశీలనలో భాగంగా వైద్యుల బృందం నంబులపూలకుంటతో పాటు ధనియానిచెరువు, పి.కొత్తపల్లి, పెడబల్లి గ్రామాల్లో పర్యటించి రూ. 15వేలు పింఛను పొందుతున్న 14 మంది పింఛనుదారుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. వీటిపై మండల వైద్యాధికారి డాక్టర్ ఆనంద్‌వర్ధన్ మాట్లాడుతూ గతంలో సదరం సర్టిఫికెట్ల ఆధారంగా పింఛన్లకు సిఫార్సు చేశామని, ప్రస్తుతం పింఛన్ల అర్హతపై విచారణ చేపడుతున్నామని, నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి-పరిగి

రైతులు తప్పనిసరిగా ఈ పంట నమోదు చేయించాలని ఏవో విజయభారతి సూచించారు. మండలంలోని పైడేటి, విట్టపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిం చారు. ఏవో మాట్లాడుతూ రబీలో సాగు చేసిన వరి, మొక్కజొన్న పంటల సాగులో సమగ్ర సస్యరక్షణ పద్ధతులు గురించి రైతులకు వివరించారు. రబీలో పంట సాగు చేసిన రైతులు తప్పని సరిగా ఈ-పంట నమోదు, ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. తెగుళ్ల నివారణకు మందులను సూచించారు.

విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తాం

ప్రజాశక్తి-బుక్కపట్నం

విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్, కార్యదర్శి నాగార్జున తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎస్ఎఫ్ఐ మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షు డిగా భరత్, ఉపాధ్యక్షులుగా భరత్, కార్యదర్శిగా విష్ణుతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై పోరాటాలు చేసేందుకు ఎస్ఎఫ్ఐ ముందుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పవన్, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణానికి చెందిన సిరిపి వెంకటేష్ జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ చాటాడు. ఈ నెల 25, 26 తేదీల్లో తమిళనాడులో జరిగిన కరాటే పోటీల్లో శిరిపి వెంకటేష్ పాల్గొని జాతీయ స్థాయిలో తృతీయ స్థానం కైవసం చేసుకున్నారు. కరాటే గురువు మాస్టర్ శివరామిరెడ్డి మాట్లాడుతూ వెంకటేష్ జాతీయస్థాయిలో రాణించడం సంతోషంగా ఉందన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-తాడిమర్రి

స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం అధికారులు మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలకు ఎటువంటి సమస్య ఉన్నా చట్టపరమైన సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వీజీ బాలసుందరి, డి.భార్గవి, పవన్, తహశీల్దార్ భాస్కర్ రెడ్డి, ఎంపిడిఒ రంగారావు సిపిడిఒ సరస్వతి, ఎపిఎం సాంబశివుడు, ఎఫ్‌పిఒ హరిప్రసాద్, ఐసిడిఎస్ సూపర్వైజర్ లలితమ్మ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి భద్రతే జీవితానికి రక్ష : ఆర్‌టిఒ

ప్రజాశక్తి-కదిరి టౌన్

రహదారి భద్రతే జీవితానికి రక్ష అని కదిరి ఆర్‌టిఒ శ్రీనివాసులు తెలిపారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కదిరి రూరల్ పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో ఉన్న స్పేస్ కళాశాలలో హరీష్ స్కూల్స్ కరస్పాండెంట్ ఎంఎస్.కిరణ్ అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్‌టిఒ మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్, కారు నడిపే టప్పుడు సీటు బెల్టు తప్పకుండా ధరించాలన్నారు. రోడ్డు నియమ, నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు అరికట్టవచ్చన్నారు. అతివేగం, మద్యం తాగి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడపడం ప్రమాదక రమన్నారు. కదిరి రూరల్ సిఐ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ యువత చెడు అలవాట్లు, మత్తు పదార్థాలు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడ కుండా బాగా చదువుకోవాలన్నారు. ఎంవిఐ వరప్రసాద్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత పాటించాలని కోరారు. అనంతరం హరీష్ స్కూల్స్ కరస్పాండెంట్ కిరణ్ అతిథులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంవిఐ రాజేష్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌టిఒ శ్రీనివాసులు

సమస్యలను వెలుగులోకి తేవడమే జర్నలిజం

ప్రజాశక్తి-హిందూపురం

ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చి అవిపరిష్కారం అయ్యేలా కథనాలు రాయడమే జర్నలిజం అని పలువురు రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. ప్రజాశక్తి సీనియర్ పాత్రికేయుడు షబ్బీర్‌కు బొమ్మారెడ్డి అవార్డు అందు కున్న నేపథ్యంలో పురం ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన్ను సన్మానించారు. ప్రెస్ క్లబ్ కార్యదర్శి ప్రశాంత్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా టిడిపి జిల్లా అధ్యక్షులు కొల్లకుం ట అంజినప్ప, పట్టణ అధ్యక్షులు డిఈ రమేష్ కుమార్, సీనియర్ నాయకులు నెట్టప్ప, కౌన్సిలర్లు రాఘవేంద్ర, అయూబ్ ఖాన్, దుర్గా నవీన్, అఖిల భారత ఫ్రీడం ఫైటర్ షహీద్, టిప్పు సుల్తాన్ యునై టెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫారూఖ్ ఖాన్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రామాంజినేయులు, సీనియర్ పాత్రికేయులు రాంప్రసాద్, సుధాకర్, ఫణి, చంద్ర శేఖర్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ప్రశ్నించే వారే పాత్రికేయులన్నారు. సమస్య పరిష్కారమే అజెండాగా విలేకరులు వార్తలు రాయాలన్నారు. అనంతరం షబ్బీర్‌ను సన్మానించి జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో వివిద పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు పాల్గొన్నారు.

షబ్బీర్ ను సన్మానిస్తున్న పాత్రికేయులు

ఆలయంలో షెడ్డు నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని పాండురంగ నగర్‌లో వెలసిన అయ్యప్ప స్వామి దేవాలయంలో షెడ్డు నిర్మాణానికి వైకాపా నేత కొండూరు వేణుగోపాల్ రెడ్డి విరాళం అందించారు. దేవాలయంలో జరుగుతున్న షెడ్ నిర్మాణానికి ఆయన రూ.1లక్ష విరాళాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కొటిపి హనుమంత రెడ్డి, అయ్యప్ప మందిర్ ట్రస్ట్ అధ్యక్షులు ఎంబి.బాలచంద్ర, కార్యదర్శి మేడం వరప్రసాద్, కోశాధికారి కట్టా రమేష్, ఉపాధ్యక్షులు ఎన్‌బికె.రమేష్, డైరెక్టర్ బిజి.తిరుమలేష్ పాల్గొన్నారు.

సిఎం చంద్రబాబుని కలిసిన జనసైనికుడు

ప్రజాశక్తి-హిందూపురం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును హిందూపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి ఆకుల ఉమేష్ మంగళవారం విజయవాడ సెక్రటేరియట్‌లో కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉమేష్ తో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నందమూరి బాలకష్ణ నియోజకవర్గంలో చేస్తున్న అభివద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ నియోజకవర్గంలో రహదారుల అభివద్ధి కోసం రూ 89 కోట్లు కేటాయించడం జరిగిందని ఉమేష్ వివరించారు. నామినేటెడ్ పోస్ట్ విషయంలో తమకు ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రిని ఉమేష్ కోరారు.

తెలుగు తమ్ముళ్ల సంబరాలు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

సినీనటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణకు పద్మభూషణ్ రావడం పట్ల మంగళవారం టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఆధ్వ ర్యంలో తెలుగు తమ్ముళ్లు సంబరాలు చేసుకున్నారు. పట్టణంలోని సత్తెమ్మ గుడి సర్కిల్‌లో బాలయ్య చిత్రపటానికి పాలాభిషేకం చేసి కేక్ కట్ చేసి పంచి పెట్టారు. సామకోటి మాట్లాడుతూ బాలయ్య సినీ, రాజకీయ రంగాల్లోనే కాకుండా సామాజిక సేవ చేస్తున్నారని, పద్మభూషణ్ రావడం హర్షణీయమ న్నారు. కార్యక్రమంలో భీమినేని కృష్ణప్ప, బేకరీ నా యుడు, రామప్ప, శ్రీనివాసులు, చిన్న వెంకట రాముడు, రాజప్ప, నరసింహులు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న సామకోటి

విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-పెనుకొండ

విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవా భావం అలవర్చుకోవాలని, సామాజిక అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనాలని పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కేశవ రావు సూచించారు. కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు మంగళవారం శ్రమదానం చేశారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువులో రాణిస్తూ సామాజిక సేవే లక్ష్యంగా ముందుకెళ్లాలన్నారు. విద్యార్థులు కళాశాల ఆవరణలోని పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు కియా గ్రంథాలయం బ్లాక్ వద్ద పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కాంతారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళాశాల ఆవరణలో శుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

సెజ్ భూముల రైతులతో సమావేశం

ప్రజాశక్తి-మడకశిర

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం సబ్ కలెక్టర్ ఆనంద్ కుమార్ అధ్యక్షతన ఎస్ఈజెడ్(సెజ్) భూముల రైతులతో సమావేశం నిర్వహించారు. సెజ్ కోసం మండలంలోని ఆర్.అనంత పురం, గౌడనహళ్లి రైతులు భూములు కోల్పోయారన్నారు. సమావేశంలో రైతులతో సంబంధిత అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కరుణాకర్, ఆర్ఐ సోమశేఖర్, రెవెన్యూ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో దుకాణాలకు టెండర్ల ఆహ్వానం

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ బస్టాండ్‌లో దుకాణాలకు టెండర్లు ఆహ్వానించి నట్లు మంగళవారం డిపో మేనేజర్ రామసుబ్బయ్య ఓ ప్రకటనలో తెలిపారు. బస్టాండ్ పరిధిలో పది దుకాణాలు ఉన్నాయని, ఫిబ్రవరి 5వ తేదీ లోపు డిపో మేనేజర్ కార్యాలయంలో టెండర్ ఫారాలు పొంది పుట్టపర్తిలోని జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో ఫిబ్రవరి 6వ తేదీ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటలలోపు టెండర్ బాక్స్ లో వేయాలన్నారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు టెండర్ బాక్స్ తెరుస్తామని తెలిపారు.

త్వరలో హైదరాబాద్‌కు బస్సు సర్వీసు..

గోరంట్ల నుంచి హైదరాబాద్‌కు త్వరలో సూపర్ లగ్జరీ బస్సులు ప్రారంభిస్తామని డిపో మేనేజర్ రామసుబ్బయ్య తెలిపారు. ఈ బస్సు గోరంట్ల, పెనుకొండ, అనంతపురం, గుత్తి, కర్నూలు మీదుగా హైదరాబాద్ చేరుకుంటుందన్నారు. ఈ సర్వీసు ప్రతి రోజూ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

నేడు మండల సమావేశం : ఎంపిడిఒ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఈ నెల 29వ తేదీ మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సాయిమనోహర్ తెలిపారు. ఎంపిటిసిలు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులందరూ తప్పక హాజరుకావాలని తెలిపారు. అజెండా ప్రకారం అన్ని విషయాలపై చర్చించి తీర్మానిస్తామన్నారు. వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి నివారణపై ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తామని తెలిపారు.

మృతుని కుటుంబానికి పరిటాల శ్రీరామ్ పరామర్శ

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండలంలోని మంగళమడక గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త హరినాథ్(31) ఇటీవల రోడ్డు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ పరిటాల శ్రీరామ్ మంగళవారం ఆ గ్రామం వెళ్లి హరినాథ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. టిడిపి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట తుమ్మల మనోహర్, కోట్ల బాబి, సోమల ప్రకాష్‌నాయుడు ఉన్నారు.

హరినాథ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న శ్రీరామ్

అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అంగన్వాడీ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-తనకల్లు

మండలంలోని పరాకువాండ్లపల్లిలో వరండాలో అంగన్వాడీ కేంద్రం నిర్వహిస్తున్న విషయంపై మంగళవారం ప్రజాశక్తి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఆ కథనంపై స్పందించిన ఐసిడిఎస్ సిడిపిఒ గంగరత్నమ్మ సూపర్వైజర్ జయమ్మ అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రాన్ని అద్దె భవనంలో నిర్వహించడానికి స్థానికులతో చర్చించి త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. గతంలో కొందరు దుండగులు అంగన్వాడీ కేంద్రం తాళాలు పగలగొట్టి గ్యాస్ సిలిండర్ ఎత్తుకెళ్లారన్నారు. దీంతో కొన్ని రోజుల నుంచి వంట చేయడం లేదన్నారు. త్వరలోనే అద్దె భవనాన్ని ఏర్పాటు చేసి అందులో కేంద్రం నిర్వహిస్తామని తెలిపారు. వారి వెంట అంగన్వాడీ కార్యకర్త, ఆయా, గ్రామస్తులు ఉన్నారు.

రస్తా వివాదానికి పరిష్కారం

ప్రజాశక్తి-ముదిగుబ్బ

ఆర్డీవో మహేష్ మంగళవారం తహశీల్దార్ నారాయణస్వామి, మండల సర్వేయర్ శివకుమార్, రెవెన్యూ సిబ్బంది, సిఐ శివరాముడుతో కలిసి మండలంలోని రాఘవంపల్లి గ్రామం వెళ్లి రస్తా వివాదంపై విచారణ చేపట్టారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో వివరాలు తెలుసుకుని రస్తా వివాదాన్ని పరిష్కరించినట్లు తెలిపారు. మళ్లీ ఏదైనా గొడవలకు దిగితే బైండోవర్ చేస్తామని హెచ్చరించారు. చట్టం ప్రకారమే ఈ నిర్ణయం తీసుకున్నామని ఆర్‌డిఒ తెలిపారు.

మొక్కజొన్న పంటకు నిప్పు

ప్రజాశక్తి-రొద్దం

రొద్దం గ్రామానికి చెందిన కౌలు రైతు సుబ్రహ్మణ్యంకు చెందిన మొక్కజొన్న పంటకు మంగళవా రం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో కంకులతో పాటు పశుగ్రాసం కాలి బూడిదైందని బాధిత రైతు వాపోయాడు. ఈ సంఘటనతో రూ. 60 వేలు నష్టం వాటిల్లినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. ఆకతాయిలు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడానికి వెళ్లి నిప్పు పెట్టారని ఆయన ఆరోపించారు. నాలుగు నెలల క్రితం పంట సాగు చేకగా తీరి పంట చేతికందాక గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో తీవ్రంగా నష్టపోయానని ఆదుకోవాలని కోరాడు.

ముగిసిన బాబా షర్ఫుద్దీన్ ఉరుసు

ప్రజాశక్తి-తలుపుల

స్థానిక కుమ్మరపేటలో ఈ నెల 25, 26, 27 తేదీల్లో జరిగిన బాబా షర్ఫుద్దీన్ ఉరుసు ఉత్సవాలు ముగిశాయి. మొదటి రోజు గంధంతో ప్రారంభమైన ఉత్సవాలు కవ్వాలి, భక్త ప్రహ్లాద కథలతో ముగిశాయి. ఆయా రోజుల్లో భక్తజనం పెద్దఎత్తున తరలివచ్చి చక్కెర చదివింపులు చేయించారు. మొదటి రోజు రజియా, మహమ్మద్ పీరా కుటుంబం భక్తులకు భోజనం ఏర్పాటు చేశారు. మూడో రోజు పరమ శెట్టి రాధాకృష్ణ కుటుంబం 15 ఏళ్లుగా అన్నదానం చేస్తున్నారు. ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ నరసింహుడు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

యుటిఎఫ్ మోడల్ పేపర్లు పంపిణీ

ప్రజాశక్తి-గాండ్లపెంట

మండలంలోని కటారుపల్లి తుమ్మలబైలు జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు మోడల్ పేపర్లు పంపిణీ చేసినట్లు హెచ్ఎం పిటిఎం. మురాద్ షావలి, సరళ, జిల్లా యుటిఎఫ్ ఆడిట్ కమిటీ సభ్యుడు మల్లికార్జున తెలిపారు. వారు మాట్లాడుతూ గుడివెలగల గ్రామ మాజీ సర్పంచి బి.ప్రసాద్ సహకారంతో 35 మంది విద్యార్థులకు మోడల్ పేపర్లు అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ ఉపాధ్యాయులు రమణనాయక్, మహేష్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

సిఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మడకశిర

ఎమ్మెల్యే ఎంఎస్.రాజు మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సిఎం చంద్రబాబుని మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితో కలిసి సిఎంకు నియోజకవర్గ సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

IN THE COURT OF THE PRL.
DISTRICT JUDGE,
ANANTHAPURAMU
E.P.No.773/2024 in O.S.No.38/2023
Between:
Y.Vijaya Lakshmi ...D.Hr
And
Chintahapulusu Krishna kumari ...J.Dr
Notice to J.Dr
To.
Chintahapulusu Krishna Kumari,
W/o.C.Peddanna, D.No.15-111,
SBI Colony, Dharmavaram.
పై నెంబరు కేసులో J.Dr అయిన మీ హాజరు నిమిత్తం 14-02-2025వ తేది ఉదయం 10.30 గం॥లకు వాయిదా వేసినారు. ఆరోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ హైకోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
N.R.K.Mohan
Advocate, Ananthapuramu.
Cell:9440787100.